క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం



ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలుకు వెండి బుట్ట కిరీటం అందజేస్తున్న సమాజ సభ్యులు

విజయనగరం టౌన్: పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి బాలాజీ భక్త మహిళా సమాజం సభ్యులు 1.225 కిలోల వెండి కిరీటం గురువారం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామునికి నృత్యసేవ



చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: దుప్పాడలో గల అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీసూర్య అకాడమీ విద్యార్థులు గురువారం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అకాడమీ ఫౌండర్ టీవీ రామ్‌కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్య జ్యోతి బృందం చేసిన నృత్యప్రదర్శనలో చిన్నారులు దేవి, సంజన, అక్షిత, వర్షిత, సునంద, జనని చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దుర్గా ఉమాబాలాజీ చిన్నారులకు ప్రశంసపత్రాలు అందజేసి ఆశీర్వదించారు.

నామినేషన్ బోణీ పడింది..



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్తీక్

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో విజయనగరం అసెంబ్లీ స్థానానికి తొలిరోజే నామినేషన్ బోణి పడింది. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా పి.కరుణాకర్ తన నామినేషన్ పత్రాలను విజయనగరం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు అందజేశారు.

సాయిపద్మ మృతి బాధాకరం

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



సాయిపద్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ప్రముఖ కవయిత్రి, సామాజిక సేవా కార్యకర్త సాయిపద్మ అకాల మరణం అత్యంత దురదృష్టకరమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విజయనగరంలోని పద్మ కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ, సాయి పద్మ ఆంగ్ల కవితలు, తెలుగు కవిత్వం రాయడంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు.

శస్త్రచికిత్స చేయలేదని ధర్నా



ధర్నా చేస్తున్న రోగి బంధువు

విజయనగరం ఫోర్ట్: శస్త్రచికిత్స చేయలేదని రోగి బంధువులు సర్వజన ఆస్పత్రి వద్ద గురువారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. బొబ్బిలి మండలం మల్లంపేటకు చెందిన తిరుమరెడ్డి రామారావు అనే వ్యక్తి ఇంట్లో పడిపోవడంతో కాలు విరిగింది. దీంతో మూడు వారాల కిందట సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యశ్రీ నుంచి బుధవారం అనుమతులు రావడంతో శస్త్రచికిత్స చేస్తామని రామారావును గురువారం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు ఉంచి ఆపరేషన్ శుక్రవారం చేస్తామని డాక్టర్ చెప్పడంతో.. ఇంతవరకు ఉంచి ఇప్పుడు ఎందుకు చేయరని రోగి బంధువులు డాక్టర్‌ను నిలదీశారు. దీంతో డాక్టర్ స్పందిస్తూ ఇష్టం ఉంటే ఉండండి... లేకపోతే వెళ్లిపోండని బదులివ్వడంతో రోగి బంధువులు ఆగ్రహించి పేషెంట్‌తో సహా ఆస్పత్రి గేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటిండెంట్ అనిలాసునందని వద్ద సాక్షి ప్రస్తావంచగా.. రోగికి సోడియం లెవల్స్ తగ్గిపోవడం వల్ల ఆపరేషన్‌ను శుక్రవారానికి వాయిదా వేసినట్టు ఆర్థో ప్రొఫెసర్ మణికుమార్ చెప్పారని తెలిపారు. శుక్రవారం ఆపరేషన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్పొరేట్‌కు దీటుగా...

- ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ సర్కార్
- ఐదేళ్లలో విద్యారంగానికి పెద్దపీట



ఠీవీగా దర్శనమిస్తున్న ఎంజేబీ కార్పొరేషన్ పాఠశాల భవనం



కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల తరగతి గది



మండలంలోని జొన్నవలస ఉన్నత పాఠశాల



అభివృద్ధి చేసిన తర్వాత మలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ఆకర్షణీయంగా దర్శనమిస్తున్న కొత్తపేట ప్రాంతంలో గల కేపీ గొల్ల ప్రాథమిక పాఠశాల



కేపీ గొల్ల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

విజయనగరం: విద్యాభివృద్ధితోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్న మంచి సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'మనబడి నాడు – నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అభివృద్ధి చేశారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో పాటు అదనపు భవనాలు, ప్రహరీలు నిర్మించారు. అలాగే ఆంగ్ల మీడియం కూడా ప్రవేశపెట్టడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫారాలు అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ నెలకొంది. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని 92 పాఠశాలలను రెండు విడతల్లో అభివృద్ధి చేశారు. మిగిలిన పాఠశాలలను కూడా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాల



అందంగా ముస్తాబైన ఎంజేబీ కార్పొరేషన్ పాఠశాల

నియోజకవర్గంలో మొత్తం పాఠశాలలు :	123
ఉన్నత పాఠశాలలు :	16
ప్రాథమికోన్నత పాఠశాలలు :	9
ప్రాథమిక పాఠశాలలు :	98
ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థులు :	15,724
నాడు–నేడు రెండు దశల్లో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య:	92
పాఠశాలల అభివృద్ధికి చేసిన ఖర్చు :	రూ. 26.42 కోట్లు

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 1వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 1వ డివిజన్ వేణుగోపాలపురం, పూల్‌బాగ్ పరిధిలోని హనుమాన్‌నగర్, నందిగుడ్డి కాలనీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడం వల్ల నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సుపరిపాలన సాగిందన్నారు. ఎటువంటి అవినీతి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇవన్నీ గమనించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్లుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించారని తెలిపారు. మరోసారి కోలగట్లను గెలిపించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ.. నగర రూపురేఖలను మార్చి సుందరంగా తీర్చిదిద్దిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వచ్చే నాయకులకు బుద్ధి చెప్పి.. నిరంతరం ప్రజల చెంతనే ఉండే కోలగట్లను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఒకటో డివిజన్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

టీడీపీ రెబల్ అభ్యర్థిగా గీత నామినేషన్ నేడు



మీసాల గీత, టీడీపీ రెబల్ అభ్యర్థి

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా (స్వతంత్ర) శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో టీడీపీ అధిష్ఠానం టిక్కెట్ కేటాయింపులో మొండిచేయి చూపించినా, ఈసారి ఎన్నికల్లో తప్పనిసరిగా టిక్కెట్ ఇస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్ మాటిచ్చారని పేర్కొన్నారు. ఈ సారి కనీసం తనకు చెప్పకుండా, సంప్రదించకుండా ఇక్కడి పెద్దల కళ్లల్లో ఆనందం కోసం తనను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం నినాదంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిల్చుంటున్నానని, నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆమె కోరారు.

అబద్ధపు హామీలు నమ్మవద్దు..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ఓటమి భయంతో కూటమిగా ఏర్పడి అబద్ధపు హామీలు ఇస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ప్రజలకు సూచించారు. మండలంలోని మధుపాడ, జోగిరాజుపేట గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాల హామీలను శతశాతం నెరవేర్చి తాము ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామన్నారు. సీఎం జగనన్న హామీ ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందని చెప్పారు. మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జోగిరాజుపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నిర్లక్ష్యం తగదు..

విజయనగరం టౌన్: ఫోర్ జీ పరికరాల సరఫరాలో నిర్లక్ష్యం తగదని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తయారీ సమస్యలతో టీసీఎస్ సంస్థ నుంచి ఎంతో కాలంగా ఫోర్‌జీ పరికరాలు సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. నెట్‌వర్క్ సమస్యలతో లక్షలాది మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌ను విడిచి పెడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ఫోర్‌జీ సేవలను అందించేందుకు తాత్కాలికంగా ఐడియా నెట్‌వర్క్ వినియోగానికి బీఎస్ఎన్ఎల్‌కు అనుమతించాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా

విజయనగరం/విజయనగరం రూరల్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా, సమాజ సేవకులుగా ఉన్న వలంటీర్లు తమ రాజీనామాలను సమర్పిస్తున్నారు. ఇన్నాళ్లూ నిస్వార్థంగా సేవలు అందించిన వారంతా ప్రతిపక్ష నాయకులు చేస్తున్న లేనిపోని ఆరోపణలకు మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నారు. మండల పరిధిలో 53 మంది, కార్పొరేషన్ పరిధిలోని 51 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. కొండకరకం నుంచి 12 మంది, గుంకలాం – 14 మంది, ద్వారపూడి – 13, నారాయణపురం – 7, ముడుదాం నుంచి ఏడుగురు రాజీనామాలు సమర్పించారు. అలాగే నగర పరిధిలోని 37వ డివిజన్ బీసీ కాలనీ నుంచి 15 మంది, మూడో డివిజన్ పూల్‌బాగ్ నుంచి 8 మంది, 14వ డివిజన్ కుమ్మరివీధి నుంచి 18 మంది, 17వ డివిజన్ పుచ్చలవీధి నుంచి పది మంది రాజీనామాలు సమర్పించారు.ఈ సందర్భంగా వలంటీర్లు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను 58 నెలల పాటు చిత్తశుద్ధితో నెరవేర్చామన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నామని చెప్పారు. అయితే తమ నిస్వార్థ సేవలపై చంద్రబాబు, ఇతర ప్రతిపక్ష నాయకులు తప్పుడు వ్యాఖ్యలు చేయడంతో మనస్తాపం చెందామన్నారు. అందుకే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని, వలంటీర్ వ్యవస్థను బతికించుకునేందుకు రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

నేడు బడ్డుకొండ ఎన్నికల ప్రచారం

భోగాపురం: మండలంలోని నందిగాం, సుందరపేట గ్రామాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తొలిరోజు ఐదు నామినేషన్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజైన గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బడ్డుకొండ అప్పలనాయుడు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజుకు ఆయన మల్టిపుల్ సెట్లు అందజేశారు. అలాగే ఆయన సతీమణి బడ్డుకొండ పద్మావతి కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె రెండు సెట్లు నామినేషన్ పత్రాలను అందజేశారు. సమాజ్‌వాదీ పార్టీ తరఫునన నామినేషన్ దాఖలు చేసేందుకు సంబంధిత అభ్యర్థి విచ్చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో పత్రాలు లేనందున వెనుదిరిగారు. దీంతో తొలిరోజు ఇద్దరు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు దాఖాలు చేశారు.

అప్రమత్తత తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: వడదెబ్బ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. గొట్లాం హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బయట తిరగరాదని సూచించారు. వేడి గాలులు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కళ్లు తిరగడం, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలుంటే వైద్యుడ్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఝాన్సీ, డాక్టర్ సత్యవాహిని, పాఠశాల ఉపాధ్యాయులు బి.జగదీష్, పి. పార్వతీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపే మా లక్ష్యం..

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా, బడ్డుకొండ అప్పలనాయుడును ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించడమే మా లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, నాయకులు అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేసిన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా తెలిపేందుకు మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోషణరావు, ఉప్పాడ శివారెడ్డి, సుందర హరీష్, వాసుపల్లి రేయ్యుడు, అమ్మోరు, బైరెడ్డి రమణ, కొల్లు అప్పారావు, పోతిరెండి గోపి, ఆళ్ల ఉదయబాబు, అరజర్ల నరసింగరావు, మైలపల్లి ఎల్లాజీ, రాయి ఈశ్వరరావు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నోటీస్‌బోర్డుల్లో ఎన్నికల నోటిఫికేషన్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను ప్రచురించారు. ఆయా సచివాలయాల్లో కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో నోటీస్ బోర్డుల్లో ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను అతికించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మంచి జరగాలంటే జగనన్నే రావాలి..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు
- అట్టహాసంగా బడ్డుకొండ అప్పలనాయుడు నామినేషన్
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: అవ్వా,తాతలకు ప్రతి నెలా ఒకటో తారీఖు వేకువజామునే పింఛన్ సొమ్ము అందాలన్నా... అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కలగాలన్నా.. ఇంటింగా సంక్షేమ వెలుగులు నిండాలన్నా..గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలన్నా...నిస్వార్థ ప్రజా నాయకుడు జగన్ మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్లలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు వేలాది కార్యకర్తలు, అభిమానులతో కలిసి గురువారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగిన బహిరంగ సమావేశంలో మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రజా సంకల్పయాత్ర పేరిట జగనన్న వేలాది కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను దగ్గరగా చూశారన్నారు. అందుకే ఆర్థిక అసమానతలు తొలగేలా ప్రజా ఉపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలన్నీ అమలు చేసి ప్రజాబంధువుగా పేరుగాంచిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. అత్యంత శక్తివంతమైన ప్రజా నాయకుడైన జగన్ మోహన్‌రెడ్డిని ఢీ కొట్టేందుకు చంద్రబాబునాయుడు పొత్తులతో జత కట్టి వస్తున్నాడని.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పెత్తందారులను ఇంటికి సాగనంపి ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలో ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా జగనన్న చూసుకున్నారని, ఉన్న ఊరిలోనే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. త్వరలో విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా మారబోతోందని.. ఉత్తరాంధ్ర జిల్లాలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధిని సాధిస్తాయన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే సీఎం హోదాలో జగనన్న ప్రారంభిస్తారన్నారు. మరికొన్ని రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీలు అంబళ్ల సుధారాణి, బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, చనమళ్ల వెంకటరమణ, పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నాయకులు ఉప్పాడ శివారెడ్డి, రేగాన శ్రీనివాసరావు, మహంతి శ్రీనివాసరావు, పిన్నింటి తమ్మినాయుడు, సారిక గౌరి, వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, గంటా సతీష్, చిక్కాల అరుణకుమారి, సంతోష్, నాలుగు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రత్యేక ప్రతిభ

డెంకాడ: విభిన్న ప్రతిభావంతుల్లో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని మండల విద్యాశాఖాధికారి – 2 రాధాకృష్ణ అన్నారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల ఎంపిక శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరానికి డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల, విజయనగరం మండలాలకు చెందిన 150 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ భారతి, డాక్టర్లు తాజ్‌కుమార్, సీహెచ్‌కే నాయుడు, డెంకాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విభిన్నప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాధాకృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ లవరాజు పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు